క్లుప్తంగా

వైద్య సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొనాలి



వీపనగండ్ల: ఎన్నికల కమీషన్ ఆదేశానుసారం వైద్య సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొనాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రాథమిక వైద్యానికి అవసరమైన అత్యవసర కిట్‌ను తప్పనిసరిగా ఉంచుకోవాలని, అందుకు అవసరమైన పరికరాలను, మందులను ముందస్తుగా సమకూర్చుకోవాలని ఆయన సూచించారు. నెలవారి నివేదికల తయారీలో జాగ్రత్త వహిస్తూ అవసరమైన రిపోర్టులను సకాలంలో అందజేయాలని ఆయన ఆదేశించారు.

బీఎస్పీతోనే బహుజనులకు మేలు



ఆత్మకూర్: నియోజకవర్గంలో వీజేఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.కోట్లు సొంత నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని బీఎస్పీ అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గ్రామాల్లో బీఎస్పీ అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వర్కటం అంజనారెడ్డి, కళాధర్‌రెడ్డి, అనిల్, స్వరాజ్, నాని, రమేష్, శివ, శ్రీధర్ ఉన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు..



కోడేరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉందని ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో బీఆర్‌ఎస్ శ్రేణులు చేపట్టిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు సోషల్‌మీడియాలో తామే గెలుస్తున్నట్లు హైప్ క్రియేట్ చేస్తున్నారని విమర్శించారు. గ్రౌండ్ లెవల్లో వాస్తవ పరిస్థితులు వేరేలా ఉన్నాయి. రైతులు, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌కు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు రకరకాల మీటింగ్‌లు పెట్టి ప్రజలను మభ్య పెట్టేందుకు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆపార్టీ నాయకులే నిరుద్యోగ జేఏసీ పేరిట టీషర్టులు వేసుకొని ర్యాలీలు నిర్వహించాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. ర్యాలీలో రంగినేని అభిలాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: పెద్దకొత్తపల్లి మండలాన్ని ఎన్నో రకాల అభివృద్ధి చేశానని, మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంతో పాటు ముష్టిపల్లి, పెద్దకార్పాముల గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేశానన్నారు. విద్యార్థులకు ఇంటర్ కాలేజీ, తహసీల్దార్ కార్యాలయం, రైతులకు సాగునీరు, పింఛన్లు, రైతుబంధు, తదితర పథకాలను అందించామని గుర్తు చేశారు. అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, ఎంపీటీసీ రేణుక, జెడ్పీటీసీ మాజీ వెంకటయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

గిరిజనుల వేషధారణలో బీరం విజయ

నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగుడలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి భార్య విజయ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గిరిజనుల సంప్రదాయ వస్త్రాలు ధరించి ఆమె ప్రచారం చేపట్టారు. గిరిజన మహిళలతో కలిసి బంజారా నృత్యాలు చేశారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి విజయమ్మ కొత్తబస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 ఏళ్ల పాలనలో కొల్లాపూర్ ప్రాంతానికి జూపల్లి కృష్ణారావు చేసిందేమీ లేదని, ఒక్కసారి గెలిచిన బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేసిన అభివృద్ధి మీ కళ్ల ముందు కనిపిస్తుందన్నారు. మరోసారి అవకాశం ఇస్తే రుణం తీర్చుకుంటామని కోరారు. కార్యక్రమంలో రాజేష్, సురేందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, శేషు, యాగొస్,రమణ ఉన్నారు.

కోడేరు: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతాయని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎత్తం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పథకాలను చూసి మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి, ఆది కొమ్ము దానయ్య తదితరులు పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో ర్యాలీలో పాల్గొన్న బీరం విజయమ్మ



కొల్లాపూర్‌లో జన సందోహం



పెద్దకొత్తపల్లిలో..

సంక్షేమమే కాంగ్రెస్ అజెండా



మక్తల్‌లో నిర్వహించిన రోడ్ షో లో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి

మక్తల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం అంబేడ్కర్‌చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలందరూ నిబద్ధతతో పనిచేయాలని కోరారు. పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఇంటింటి ప్రచారం చేశారు. మక్తల్ మండలంలోని పంచదేవ్‌పాడు సర్పంచ్ కల్పన వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, గడ్డంపల్లి హన్మంతు, మాన్వే రామరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోళ్ల వెంకటేష్, గణేష్‌కుమార్, రవికుమార్, చంద్రశేఖర్‌గౌడ్, తాయప్ప పాల్గొన్నారు.

అమరచింత: మండల కేంద్రంలో మంగళవారం టీడీపీ నాయకులు కాంగ్రెస్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి కాంగ్రెస్ నాయకులతో కలిసి మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. మోదీమనోహర్ రాజు, గోపాల్‌యాదవ్, కురుమన్న, ఆయూబ్‌ఖాన్, పురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మక్తల్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధి జరుగుతుందని మక్తల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంతో పాటుగా అచ్చంపేట, పెగడబండ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మాగనూర్‌లో ఆయనకు కార్యకర్తలు, మహిళలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ర్యాలీ అనంతరం బస్టాండ్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో కనీస రోడ్డు సౌకర్యం కల్పించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని ధ్వజమెత్తారు. వాగులో ఇసుక అమ్ముకనే దానిపై ఉన్న దృష్టి రైతులకు సాగునీరు అందించడంలో లేదని ఎద్దేవా చేశారు.

కున్సిలో..

కృష్ణా: మండలంలోని కున్సి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరికి ఓటు వేసి గెలుపించాలని కోరారు. కార్యక్రమంలో రాజప్పగౌడ, రాంలింగప్ప, అంజప్పగౌడ్, నాగేందర్, పల్లె సురేష్, శ్రీనివాసులు ఉన్నారు.

నర్వ: మక్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం తథ్యమని మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయికోడ్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ బడుగు బలహీనవర్గాల అభ్యర్థి వాకిటి శ్రీహరిని గెలిపిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపిస్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, సర్పంచ్ సుశీల శ్రీనివాసులు, ఉప సర్పంచ్ తాయన్నగౌడ్, మల్లేష్‌యాదవ్, ఆంజనేయులుగౌడ్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి



కున్సిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆశీర్వదిస్తే అభివృద్ధి చేస్తా



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్/చిన్నచింతకుంట/దేవరకద్ర రూరల్/అడ్డాకుల: ఎమ్మెల్యే ఆల మంగళవారం అన్నాసాగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్యే సతీమణి ఆల మంజుల మంగళవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు.

మరోసారి కారు గుర్తుకు ఓట్లేసి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. అడ్డాకులలో మంగళవారం బీఆర్‌ఎస్ శ్రేణులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిపక్షాలు లేనిపోని మాటలు చెప్పి ఓట్లను దండుకోవడానికి వస్తున్నాయని, వారి మాయ మాటలను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీ కోఆప్షన్ మహిమూద్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మంగళవారం చౌదర్‌పల్లి, హాజీలాపూర్, లక్ష్మీపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాటం ప్రదీప్‌కుమార్ గౌడ్, సర్పంచ్‌లు యుగేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, కొండ శ్రీను, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం

ఆత్మకూర్: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మకుండా మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మరోసారి మక్తల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆశీర్వదించాలని రాష్ట్రస్పోర్ట్స్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, ఎమ్మెల్యే సతీమణి చిట్టెం సుచరిత అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారుశ్రీను, శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ శివరంజని, కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్ తదితరులు పాల్గొన్నారు.



అన్ని వసతులు కల్పిస్తాం



పెబ్బేరులో మంత్రి నిరంజన్‌రెడ్డికి మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గోపాల్‌పేట: తనకు మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అభివృద్ధిని డబుల్ చేసి చూపిస్తానని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గోపాల్‌పేట మండలంలోని జింకలబీడు తండా, ఆముదాలకుంటతండాలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఎంతో అభివృద్ధి చేశానని, ఇంకా ప్రజలకు ఏం చేయాలో తన ఆలోచనలో ఉందని చెప్పారు. తండాకు కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని గెలిపించాలని మంగళవారం పెబ్బేరు పట్టణ కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు రోడ్‌షో నిర్వహించారు. శ్రీరంగాపురం మండలంలోని వివిధ గ్రామాల్లో నాయకులు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి నిరంజన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సూగూరుకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, రజక సంఘం కుటుంబాలకు చెందిన సభ్యులు వనపర్తిలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, గౌని బుచ్చారెడ్డి, దిలీప్‌రెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి, రాజశేఖర్‌గౌడ్, పరశురాం, షన్ముఖి, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



జింకలబీడుతండాలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజలంతా కాంగ్రెస్ వైపే



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల/దేవరకద్ర: బీఆర్‌ఎస్ పాలనపై విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజలు విశ్వసించినందున 30న జరిగే ఎన్నికల్లో హస్తం హవా కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శెట్టిశేఖర్, నాగిరెడ్డి, శ్రీహరి, రామన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని అధికారం వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేయడం ఖాయమని దేవరకద్ర కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్రలో భారీ బైక్ ర్యాలీ అనంతరం కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగి పోయారని అవినీతి అక్రమాలతో ఆ పార్టీ నేతలు వందల కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు.

నియంత పాలనకు చరమగీతం



వనపర్తి: రాష్ట్రంలో, నియోజకవర్గంలో కొనసాగుతున్న నియంతపాలనకు చరమగీతం పాడే సమయం వచ్చిందని కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆయా కాలనీల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భగీరథ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ షోలో ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ జి.చిన్నారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డితో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు తాను స్వయంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆరు గ్యారెంటీలను ఇచ్చానని తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌ప్రసాద్, వెంకటయ్య యాదవ్, పసుపుల తిరుపతయ్య, బ్రహ్మం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ



పెబ్బేరు రూరల్: వనపర్తి బీజేపీ అభ్యర్థి అనుజ్ఞారెడ్డికి మద్దతుగా మంగళవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు మేలు జరగాలంటే అవినీతికి చోటివ్వని బీజేపీని ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

పెద్దజీతగాడిలా ప్రజలకు సేవ చేస్తా



బొందల్‌కుంటలో బీజేపీలో చేరిన నాయకులతో మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి

మక్తల్: తనను మక్తల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల కోసం పెద్ద జీతాగాడిలా పని చేస్తానని బీజేపీ మక్తల్ ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ద్విచక్ర వాహనాల ర్యాలీ కోలార్ ఎంపీ మునిస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, వారికి మరోసారి అధికారం ఇస్తే రాష్ట్రంలో నియంత పాలన కొనసాగిస్తారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్‌పర్సన్ అఖిలారెడ్డి, మాగనూర్ ఎంపీపీ శ్యామలమ్మ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, కౌన్సిలర్లు చీరాల సత్యనారాయణ, ప్రసన్నరెడ్డి, అర్చన, కర్ని లక్ష్మి, కౌసల్య, మండల అధ్యక్షుడు లక్ష్మన్, మండల అర్బన్ అధ్యక్షుడు రాజశేకర్‌రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ద్యావరింటి నర్సింహరెడ్డి, నాగప్ప, ఈసరి నాగప్ప, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని కర్ణాటకలోని కోలార్ ఎంపీ మునిస్వామి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఊట్కూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. భరత్‌నగర్, పాతపేట, మెయిన్ బజార్, శివాజీనగర్ తదితర ప్రాంతాలలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని, ప్రతి కుటుంబానికి దళితబంధు ఇస్తానని చెప్పి ఏ ఒక్క హామీని కూడా ఇప్పటి వరకు నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాదిరెడ్డి పద్మజారెడ్డి, కొండయ్య, భాస్కర్, కృష్ణయ్య గౌడ్, రమేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: బీజేపీ బలపర్చిన అభ్యర్థి మాదిరెడ్డి జలేంధర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు బీజేపీ కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని మండల ఎన్నికల ఇన్‌చార్జి మహంకాళీ శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన 30 మంది యువకులు ఇతర పార్టీల నుంచి మంగళవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ ప్రచారం చేస్తు బీజేపీ అందిస్తున్న సుపరిపాలన గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో మేర్వరాజు, శ్యామ భాస్కర్, అశోక్‌కుమార్, నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మక్తల్‌లో ద్విచక్రవాహన ర్యాలీ చేస్తున్న మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, ఎంపీ మునిస్వామి



మాట్లాడుతున్న మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి